క్లుప్తంగా

ఆలయ అర్చకులకు సన్మానం



అర్చకులను సత్కరిస్తున్న దృశ్యం

వైరా: వైరాలో కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులకు సోమవారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆలయాల్లో పండితులు చేసే సేవలు అనిర్వచనీయమైనవని కొనియాడారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, అర్చకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీ బస్‌పాసులు



బస్‌పాసులు అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

చింతకాని: మండలంలోని సీతంపేటలో ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ సిబ్బంది దివ్యాంగులకు రాయితీ బస్‌పాసులను సోమవారం అందజేశారు. దివ్యాంగులకు ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీ బస్‌పాసులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రవీంద్రనాథ్, భజంగర్, పుల్లయ్య, గ్రామ మాజీసర్పంచ్ నారపోగు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతి జమలాపురం వేంకటేశ్వరస్వామి ఉప ఆలయమైన శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం వద్ద.. భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు, వాహన పార్కు ఏర్పాటు నిమిత్తం ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈరోడ్డు నిర్మాణానికి పల్లిపాడుకు చెందిన భక్తుడు తాటిపల్లి వీరభద్రయ్య ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వీరభద్రయ్యను ఆలయ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి అభినందించారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, నాయకులు రామారావు, అంకిరెడ్డి, సుఖవాసి రమేష్, ఎల్వీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా లయన్స్‌క్లబ్

వైరా: వైరా లయన్స్‌క్లబ్ నిరుపేదలకు నిత్యం అండగా ఉంటుందని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్ అన్నారు. సోమవారం వైరా రాయపూడి వెంకటేష్, రజినీ దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకొని నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కొల్లా రాంబాబు, మరికంటి రాంగోపాల్, నూకల ప్రసాద్, చింతోజు నాగేశ్వరరావు, వై.బుజ్జి రామారావు, రాయపూడి నారాయణరావు, నాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

వైరా: వైరా గ్రేట్ విజన్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ చదువుతున్న నిరుపేద విద్యార్థులు పెనుగొండ రుషి, బానోత్ గీతలకు విద్యా ట్రస్ట్ ద్వారా సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కోర్డినేటర్ ఉంద్రూ శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, ఉంద్రూ వరలక్ష్మీ, గంగవరపు కిషన్, జాలా పుల్లారావు, వుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మీ, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు..



బాధితురాలికి రూ.5 వేలు నగదు అందిస్తున్న గౌసుద్దీన్

కారేపల్లి: కారేపల్లి అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన చింతల వజ్రమ్మ గత మూడేళ్లుగా వెన్నెముక వ్యాధితో బాధపడుతుంది. ఆమె భర్త చింతల చిన్నశ్రీను ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ కుటుంబ దీన స్థితిని తెలుసుకున్న కారేపల్లికి చెందిన బీఆర్ఎస్ జిల్లా మైనార్టీసెల్ నాయకుడు షేక్ గౌసుద్దీన్ రూ.5వేలు సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు ఎండీ ఖలీలుల్లా ఖాన్, రామారావు, ఉపేందర్, శ్రీనివాసరావు, శ్రీను, బాలకృష్ణ, రాములు, వినీత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణ... గోపాల కృష్ణా.. చల్లగ చూడయ్యా



వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గోకుల కృష్ణ... గోపాల కృష్ణా చల్లగ చూడయ్యా అంటూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి పోయారు. పల్లెలు, పట్టణాల్లోని పలు దేవాలయాలు, విద్యాసంస్థల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పల్లకీసేవ నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేపట్టగా.. యువత పోటీపడ్డారు. రంగునీళ్లు చల్లుతూ సందడి చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కల్లూరురూరల్: జీడీపీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..



కొణిజర్ల శివాలయంలోని కృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



సత్తుపల్లిటౌన్: గోవులకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



కారేపల్లిలో..



బోనకల్‌లో ఉట్టి కొడుతున్న బాలురు



సత్తుపల్లిటౌన్: శాంతినికేతన్ కళాశాలలో..



పెనుబల్లిలో..



వైరారూరల్: దాచాపురంలో కృష్ణుడి వేషధారణలో చిన్నారి

గోపిక, కృష్ణుల వేషధారణల్లో చిన్నారులు..



తల్లాడ: రామానుజవరంలో..



మధిర: ఇషాన్ శ్రీఅర్జున్



చింతకాని: మత్కేపల్లిలో



వేంసూరులో..



సత్తుపల్లిలో..



ఏన్కూరులో..



కొణిజర్ల: శివాలయంలో.. ఉజ్వల్‌తేజ్



ఎర్రుపాలెంలో.. ఈక్షిత కృష్ణసాయి



బోనకల్‌లో..



కొణిజర్లలో..



సత్తుపల్లిలో..

ఆందోళన చెందొద్దు..



'సాక్షి' ఫోన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.సురేష్‌నారాయణ్

సాక్షి ఫోన్ ఇన్

సత్తుపల్లిటౌన్: ఈ సీజన్‌లో వచ్చే జ్వరాలతో పాటు వైరల్ ఆర్థ్రాల్జియస్ వల్ల కీళ్ల నొప్పులు వస్తున్నాయి. జ్వరం రెండుమూడు రోజుల్లో తగ్గినా కీళ్ల నొప్పులు క్రమేణ అదుపులోకి వస్తాయని.. దీని గురించి ప్రజలు ఆందోళన చెందవద్దని సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రి ఎండీ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బి.సురేష్ నారాయణ్ అన్నారు. సోమవారం జ్వరాలు–నివారణ చర్యలపై 'సాక్షి'ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయన సమాధానాలు, పలు సూచనలు చేసి సందేహాలు నివృత్తి చేశారు.

ప్రశ్న: కరోనా టీకాల వల్ల కీళ్ల నొప్పులు వస్తున్నాయి.

– పి.పుల్లయ్య, వీ.ఎం.బంజర

జవాబు: కరోనా ఇంజక్షన్ల వల్ల ఏ సమస్య ఉండదు. అటువంటి అపోహలు నమ్మొద్దు. మనదేశమే కాకుండా ఇతర దేశాల వాళ్లు కూడా మన వ్యాక్సిన్లు వేసుకున్నారు. ఇవి చాలా రక్షణ ఇచ్చాయి. ప్రస్తుతం వైరల్ జ్వరాల వల్ల వచ్చే కీళ్ల నొప్పులే.

ప్ర: జ్వర లక్షణాలు ఉంటే ఏం చేయాలి?

– కె.అరుణ, సత్తుపల్లి

జ: వైరల్ జ్వరాలు వ్యాప్తి ఎక్కువగా ఉంది. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. అశ్రద్ధ చేయొద్దు.. ఆర్ఎంపీల వద్ద స్టేరాయిడ్ వైద్యం తీసుకొని ఇబ్బంది పడొద్దు. ప్రభుత్వాస్పత్రిలో మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: జ్వరం తగ్గింది... నొప్పులు తగ్గటం లేదు..

– ఆర్.సత్యనారాయణ, కాకర్లపల్లి

జ: వైరల్ జ్వరాల వల్ల కీళ్ల నొప్పులు సహజంగా ఉంటాయి. స్ట్రాంగ్ పెయిన్ కిల్లర్స్ వాడకూడదు. పారాసిట్మాల్ 650 మాత్రమే వాడాలి. క్యాల్షియం మాత్రలు వేసుకోండి.

ప్ర: జ్వరం వల్ల నొప్పులు మొదలై 40 రోజులైంది..

– పర్సా మల్లికార్జున్, పెనుబల్లి

జ: నొప్పులు క్రమేణా తగ్గుతాయి. అధైర్యపడాల్సిన పనిలేదు. ఏ సమస్య ఉన్నా ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించండి.

ప్ర: గత నెలలోనే జ్వరం వచ్చి పోయింది.. అప్పటి నుంచి జాయింట్ పెయిన్స్ తగ్గటం లేదు..

– కుమారస్వామి, వీ.ఎం.బంజరు

జ: వైరల్ జ్వరాల వల్ల కాళ్లు, చేతులు, యాంకిల్ జాయింట్స్ నొప్పులు వస్తాయి. అవే చిన్నగా తగ్గుతాయి. పెయిన్ కిల్లర్స్ మాత్రలు ఎక్కువగా వాడితే కిడ్నీ సమస్యలు వస్తాయి.

ప్ర: బాబుకు జ్వరంతో పాటు శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి..

– కె.రవికుమార్, సత్తుపల్లి

జ: ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి సీబీపీ పరీక్ష చేయించి కౌంట్ పరిశీలించి తగు మందులు వాడవచ్చు. దద్దుర్లు తగ్గటానికి సిట్రజిన్ వాడవచ్చు.

ప్ర: కీళ్ల నొప్పులు తగ్గటం లేదు..

– వెంకట్రామారావు, అన్నారుగూడెం

జ: ఈ సీజన్ అంతా కీళ్ల నొప్పులతోనే జ్వరాలు వస్తున్నాయి. వైద్యులను సంప్రదించండి. కండరాలకు ఇంజక్షన్లు తీసుకోవద్దు.

ప్ర: జ్వరం తగ్గింది.. నడవలేక పోతున్నాను.. ఆయాసం, దడ వస్తుంది..

– కె.లక్ష్మి, పెనుబల్లి

జ: ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోండి. పరీక్షల ఆధారంగా వైద్య సేవలు పొందండి.

ప్ర: జ్వరాలు రాకుండా ఎం చేయాలి..

– కె.రమేష్, సత్తుపల్లి

జ: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి. దోమలు ఇంట్లోకి, పరిసరాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పగటి దోమ కుట్టకుండా చర్యలు అవసరం.

మదర్ థెరిస్సా జయంతి



మధిర: కేక్ కట్ చేస్తున్న నాగేశ్వరరావు

మధిర: నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, భారతరత్న మదర్ థెరిస్సా జయంతి వేడుకలను మధిర పట్టణంలో ఉన్న సేవాసదనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొని మాతృమూర్తికి పూలమాలవేసి, మానసిక దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత పాల్గొన్నారు. అనంతరం మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు.



మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యువకులు

తల్లాడ: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా తల్లాడలో దాసరి వీరభద్రరావు యూత్ క్లబ్, మదర్ థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రింగ్‌రోడ్డు సెంటర్‌లో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీరభద్రరావు యూత్ క్లబ్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు, మదర్ థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఫణీంద్ర పాల్గొన్నారు.

సామాజిక కళాకారుడు శంకర్‌కు మదర్‌థెరిస్సా అవార్డు



శంకర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కారేపల్లి: కారేపల్లి గ్రామానికి చెందిన సామాజిక కళాకారుడు ఆదెర్ల శంకర్‌కు న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మదర్‌థెరిస్సా అవార్డును సోమవారం అందజేశారు. సామాజిక, జానపద కళాకారుడిగా గుర్తింపు ఉన్న శంకర్ తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజలను చైతన్య పరచడంతో పాటు ఎయిడ్స్, మొక్కలు నాటాలని ఊరూరా తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సేవా కార్యక్రమాలకు గాను మదర్‌థెరిస్సా అవార్డును అందజేసి ప్రశంసించినట్లు శంకర్ విలేకరులకు తెలిపారు.

స్వయం ఉపాధికి వ్యవ'సాయం'



డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సిద్ధం చేస్తున్న మిర్చినారు

కల్లూరురూరల్: వ్యవసాయ రంగం లాభసాటిగా లేదని.. ఈ రంగాన్ని వదిలేసి ఇతర ఉపాధి అవకాశాలు చూసుకుంటున్న నేటితరం యువకులకు ఎంసీఏ ఉన్నత విద్య అభ్యసించిన ఓ యువకుడు నూతన వ్యవసాయ రంగంలో మార్గదర్శకత్వం చూపిస్తున్నారు. కల్లూరు మండలంలోని దారుగ బంజరు గ్రామానికి చెందిన ఎస్‌కె.ఖాదర్.. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నాణ్యమైన మిరప కాయ నారు నర్సరీని ప్రారంభించాడు. చీడ పీడలు, వైరస్‌లను తట్టుకునే నాణ్యమైన.. సుమారు 500 ఎకరాలకు సరిపోయే మిర్చినారును తన నర్సరీలో సాగు చేస్తున్నాడు. మైకో కంపెనీ, సెమిస్ కంపెనీ, కారితకేయ రకం, సకాట తదితర పది రకాల మిర్చి విత్తనాల నారు నర్సరీలో పెంచుతున్నాడు. 4.20 ఎకరాల స్థలంలో సుమారు 80 లక్షల రూపాయలకు పైగా పెట్టుబడితో షెడ్ నెట్టు, గ్రీన్ ఛాంబర్ తరహాలో మిర్చినారు సాగు చేస్తున్నాడు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మొక్కలకు నీటిని సరఫరా చేస్తున్నారు. నర్సరీలోనే మిర్చి మొక్క బలంగా తయారయ్యే విధంగా తగిన ఎరువులు వేసి, వైరస్‌లను తట్టుకునే విధంగా మొక్కను పెంచుతున్నారు. 4 నెలల పాటు సుమారు 15 మంది కూలీలకు ఈ నర్సరీలో ఉపాధి కల్పిస్తున్నారు.

ఐదేళ్లుగా ఈ పనే..



గత ఐదు సంవత్సరాలుగా తాను మిర్చి నర్సరీని ఏర్పాటు చేసి వేలాది మది రైతులకు మిర్చి నారును సరఫరా చేశానని, ఆగస్టు నుంచి మిర్చినారు పంపిణీ చేస్తాను. మిర్చిమొక్క ఆరోగ్యంపై అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటాను. ఈ మొక్కలు ఎకరానికి సుమారు 13వేల నారు సరిపోతుంది.

– ఎస్‌కే.ఖాదర్, దారుగబంజరు


రోడ్లపై గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చుతున్న దృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఖమ్మం– అశ్వారావుపేట జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చే పనులను సోమవారం కమల్‌మిత్ర మోటార్స్ సహకారంతో కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టారు. రోడ్లపై గుంతలపై ప్రమాదాలు జరుగుతున్న విషయమై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితం కాగా, బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువపై నిర్మించి బ్రిడ్జిపై రెండు వైపుల చువ్వలు తేలాయి. దీంతో కార్యకర్తలు, బస్టాండ్ సెంటర్‌లోని గోతులను కాంక్రీటుతో పూడ్చారు. ఈ కార్యక్రమంలో కమల్ మోటార్స్ యజమాని ఎం.డీ.రహ్మత్‌పాషా, ఎం.డీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, ఎం.డీ.షాకీర్, గండ్ర విజయ సారథిరెడ్డి, చవ్వా సన్నీ, ఎం.డీ.ఖాదర్‌బాబా, మానుకోట ప్రసాద్, ఎం.డీ.యూనిస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మ మృతికి మంత్రి తుమ్మల నివాళి



అన్నపూర్ణమ్మ (ఫైల్)

సత్తుపల్లి: సత్తుపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చల్లగుళ్ల నర్సింహారావు మాతృమూర్తి చల్లగుళ్ల అన్నపూర్ణమ్మ(91) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె భౌతి కాయానికి వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, డాక్టర్ మట్టా దయానంద్, పలువురు నివాళులర్పించారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంకెన నారాయణ(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు గోపి, కిషోర్, భాస్కర్, నాగార్జున్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గోవిందరావు, తదితరులు నివాళులర్పించి మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

ముదిగొండ: పాతగొడవలు మనసులో పెట్టుకుని తనతోపాటు తన బంధువులు, తనకు మద్దతు ఇచ్చిన వ్యక్తిపై చెన్ను నాగమల్లేశ్వరరావు, అతని అన్న చెన్ను నాగరాజు ఇరువు కలిసి ఆదివారం దాడి చేసి గాయపరిచారు. దీంతో సోమవారం వనంవారికిష్టాపురానికి చెందిన మల్లెల రమేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. రమేష్ ఫిర్యాదు మేరకు ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



రాఘవాపురంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతకాని: మండలంలోని నేరడ, రాఘవాపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందించారు. గ్రామాల్లో విషజ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉన్నందున పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్లు వెంకటేశ్వర్లు, సోయల్, సీహెచ్ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

కొణిజర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ఏఐకేఎస్ సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొణిజర్ల మండలంలోని సింగరాయపాలెం, తీగలబంజరలలో నిర్వహించిన సంఘం సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రైతు సమస్యలపై ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ వైరా డివిజన్ కార్యదర్శి అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



కొణిజర్ల: తనికెళ్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొణిజర్ల: రైతు రుణమాఫీపై నేడు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం (సీపీఎం) జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలో జీపు జాతా నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు రుణమాఫీ 40శాతం మంది రైతులకు కూడా కాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, తిలక్, సత్యం, రామారావు, సాంబశివరావు, వెంకయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్: రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను షరతులు లేకుండా మాఫీ చేయాలని ఈ నెల 27వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంబాబు, రామారావు, రామకృష్ణ, మధు, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: మండలంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏఐకేఎస్ తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. 27న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రవీంద్రబాబు, సీపీఐ మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, కూచిపూడి రవి, కొత్తపల్లి రమేష్, వెంకటి, పాషా పాల్గొన్నారు.

బోనకల్: తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆనందరావు, సహాయ కార్యదర్శి పవన్, నాయకులు పాల్గొన్నారు.

పెనుబల్లి: రుణమాఫీ విషయమై మండలంలోని లింగగూడెంలో నిర్వహించిన రైతుల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మినేని సుధాకర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 3,71,152 మంది రైతులకు గాను 1,15,343 మంది రైతులు మాత్రమే రుణమాఫీ అయ్యిందని.. మిగిలిన రైతులు తీవ్ర నిరాశ, ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి పీఏసీఎస్ డైరెక్టర్ జోగయ్య, శ్రీను, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.